క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి అన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద నిధులు మంజూరు కావడంతో బుధవారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం, నాయకులు నర్సింహా రెడ్డి, ప్రభు, విఠల్, చంద్రశేఖర్, అంజాగౌడ్, సదానందం, నర్సిహులు, శ్రీశైలం, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో భాగంగా రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉసామొద్దిన్, శ్రీకాంత్, మోహన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

11న పూలే జయంత్యోత్సవాలు



మాట్లాడుతున్న గంగారాం

రామాయంపేట(మెదక్): ఈనెల 11న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారాం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో జయంత్యోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం క్రమశిక్షణ విభాగం అధ్యక్షుడు గణేశ్, జిల్లా కోశాధికారి దామోదర్, నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్ధరాంలు, ప్రగతి ధర్మారం గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.

తీగలపై పడిన ఫ్లెక్సీ తొలగింపు



తీగలపైన ఉన్న ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

నర్సాపూర్: విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీలను బుధవారం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. స్థానిక చౌరస్తాలో ఇటీవల ఆయా పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా అవి చిరిగిపోయి.. వాటి ముక్కలు మంగళవారం రాత్రి వీచిన గాలికి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడగా అధికారులు రాత్రి తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. బుధవారం తీగలపై ఉన్న ఫ్లెక్సీ ముక్కలన్నింటినీ సిబ్బంది తొలగించారు.

ఇళ్ల నిర్మాణంపై అవగాహన



నడిమితండాలో ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అల్లాదుర్గం(మెదక్): పేద ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను వెంటనే నిర్మించుకునేలా ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని నడిమితండాను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో పర్యటించి లబ్ధిదారులు నిర్మించుకునేలా అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం మూగజీవాల గోస

నిరుపయోగంగా పశువుల నీటితొట్లు

- ఎండిపోతున్న చెరువులు, కుంటలు
- దూర ప్రాంతాలకు తీసుకెళ్తున్న కాపరులు
- పట్టించుకోని అధికారులు



కాగజ్ మద్దూరులో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి



తాగునీటి కోసం పశువులను తీసుకెళ్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: వేసవిలో మూగజీవాలు నీటి కోసం తండ్లాడుతున్నాయి. ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో వాటి దాహార్తి తీర్చేందుకు గిరిజన తండాలతో పాటు గ్రామాల్లో నీటి తొట్లు నిర్మించింది. సంబంధిత అధికారులు వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో మూగజీవాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నిచోట్ల నీటి తొట్లు శిథిలావస్థకు చేరగా.. మరికొన్ని నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో దెబ్బతిన్నాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు.

నర్సాపూర్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 56కు పైగా గిరిజన తండాలు ఉన్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2019 వరకు గ్రామాల్లో, గిరిజన తండాల్లో మూగజీవాల సంఖ్యకు అనుగుణంగా సుమారు 70 వరకు నీటితొట్లు నిర్మించారు. రెడ్డిపల్లి, నారాయణపూర్, పిల్లికుంట గుంట తండా, మూసాపేట, తదితర గ్రామాల్లో నీటి తొట్లు ధ్వంసం కాగా కాగజ్ మద్దూర్, గూడెంగడ్డ, అవంచ, రామచంద్రపూర్, తదితర చోట్ల నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఎండలు దంచి కొడుతుండటంతో చెరువులు, కుంటలు, బోరు బావుల్లో సైతం నీరు అడుగంటి పోయాయి. దీంతో పశుపోషకులు దూర ప్రాంతాల్లోని చెరువుల వద్దకు పశువులను తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి



గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టి పగుళ్లు ఏర్పడటంతో నీరు నిల్వడం లేదు. నీటిని తాగేందుకు మూగ జీవాలు అవస్థలు పడుతున్నాయి. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తే పశుపోషకులకు మేలు జరుగుతుంది.

– నీరుడి అంజయ్య, రైతు, మూసాపేట

చర్యలు తీసుకుంటాం



గ్రామాలు, గిరిజన తండాల్లోని పశువుల నీటి తొట్లను పరిశీలించి నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటాం. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు గ్రామాల్లోని బోర్లలో నీరు అడుగంటి పోవడంతో తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయి.

– శ్రీనివాస్, ఎంపీఓ, నర్సాపూర్



ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులను సన్మానిస్తున్న మైనారిటీ నాయకుడు షేక్ హుస్సేన్

మత సామరస్యానికి ప్రతీక ఈద్‌మిలాప్

నర్సాపూర్: మత సామరస్యానికి ప్రతీక ఈద్‌మిలాప్ అని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు షేక్ హుస్సేన్ ఇంట్లో బుధవారం ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆమెతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మన్సూర్, జితేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నయీం, సత్యంగౌడ్, నర్సిహులు, భిక్షపతి, ప్రసాద్, జ్ఞానేశ్వర్, రాకేశ్ గౌడ్, మహ్మద్ పాల్గొనగా వారందరిని షేక్ హుస్సేన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈద్‌మిలాప్‌లో పాల్గొన్న వారందరికి శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది ఆకుల శ్రీనివాస్

నర్సాపూర్ రూరల్: ప్రతి మహిళకు చట్టాలు తెలిసి ఉండాలని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాది ఆకుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లిలో డ్వాక్రా సంఘం మహిళలకు లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భార్యాభర్తల వివాదాలు, బాల్య వివాహాలు, ఆడపిల్లలకు ఆస్తులలో హక్కులు, బాల కార్మికులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.దీంతోపాటు వినియోగదారుల ఫోరంపై వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు శ్రీనివాస్ గౌడ్, జి.శ్రీనివాస్ గౌడ్, స్వరూప రాణి, రాజు నాయక్, ఏజీపీ సుధాకర్, సాయిరాం, రవి నాయక్ ఐకెపీ ఏపీఎం గౌడ శంకర్ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ కూలీలు ఎండ వేడిమికి ఇబ్బందులు పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ను ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ అందజేశారు. పెద్దశంకరంపేటలో ఉపాధిహామీ కూలీలకు బుధవారం పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుశాతం, మస్టర్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు తదితరులున్నారు.

పత్తికుంటలో పనుల పరిశీలన..

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైనవారు ఉపాధిపనులను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల పత్తికుంటలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 150 నుంచి 180మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు.



పెద్దశంకరంపేట: కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేస్తున్న సిబ్బంది

వేతనాలు చెల్లించాలని నిరసన

మనోహరబాద్(తూప్రాన్): వేతనాలు చెల్లించాలని జీడిపల్లి గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 నెలలుగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న తమకు వేతనాలు రాక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అర్జున్, భూపాల్, సత్యనారాయణ, రాంచందర్, ముత్యాలమ్మ, రేణమ్మ, సువర్ణ తదితరులు ఉన్నారు.

నత్తనడకన కాలువ నిర్మాణ పనులు

నర్సాపూర్: పంట కాలువ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నర్సాపూర్ రాయరావు చెరువుకు సంబంధించిన పంట కాలువకు ఇరు వైపులా గోడల నిర్మాణ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని రైతులు, కాలనీవాసులు ఆరోపించారు. కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో కాలువలో మురుగునీరు నిలిచి దోమలు పెరిగాయని, దుర్వాసన వస్తోందని చెప్పారు. తమ ఇబ్బందులను గుర్తించి, కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న పంట కాలువలో నిలిచిన మురుగునీరు

రేషన్ షాపుల్లో ప్రధాని ఫొటో పెట్టాలి

చిన్నశంకరంపేట(మెదక్): రేషన్ దుకాణాల వద్ద ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమైతే తామే ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నదని విమర్శించారు. రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ నాయకులు వారి ఫ్లెక్సీలను పెట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంజిత్ రెడ్డి, దశరథ్ , రాజు, కృష్ణ, మంజుల, మధు, శివశంకర్, రామ్‌ప్రసాద్, నర్సింహులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొచ్చిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు ఈ నెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌తో పాటు జిరాక్స్ సెట్‌ను మండల కార్యాలయంలో అందించాలని ఆయన పేర్కొన్నారు.

16న పశువుల సంతకు వేలం పాట

తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలో పశువుల సంతకు ఈ నెల 16న వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 19న నిర్వహించిన వేలం పాటలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.2.64 లక్షల కంటే తక్కువ పాడటంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

గర్భిణుల కోసమే పోషణ్ పక్వాడా



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణులకు సరైన పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనివ్వగలరని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కొర్విపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషణ్ పక్వాడాపై ఆమె అవగాహన కల్పించారు. మొదటి వెయ్యి రోజులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు

నర్సాపూర్: విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యూఐ నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు హరీశ్ వర్ధన్ అన్నారు. బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ స్థాపకురాలు, దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట యూనియన్ నాయకులు ప్రభులింగం, కృష్ణారెడ్డి, నవీన్, సాయి, ఆంజనేయులు, రవి, దశరథ్ తదితరులు ఉన్నారు.

ఏఐ బోధనతో విద్యార్థులకు మేలు



ఏఐ తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విద్యా బోధనతో విద్యార్థులకు ఎంతో మేలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏఐ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 3,4,5వ తరగతులకు కంప్యూటర్‌లో ఏఐ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా నేర్చుకుంటారని తెలిపారు. ఉన్నత పాఠశాలలో 6నుంచి 9 తరగతులకు ఎస్ఏ2 పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఓంప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు


తూప్రాన్: పట్టణంలోని పెద్ద చెరువుకట్టపై ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శలాక ఆత్రేయశర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో 10న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణం, సుందర కాండ, 11న గణపతి, నవగ్రహ, రుద్ర, పంచసూక్త మన్యుసూక్త, లక్ష్మి హోమాలు, భిక్ష, ఇరుముడి, 12న హనుమాన్ జయంతి, తదితర పూజా కార్యక్రమాలు అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్, భుజిరంపేట గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బుధవారం రేషన్‌షాపు వద్ద సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పోచాగౌడ్, గోపాల్, మధుసూధన్‌రెడ్డి, బోరంచ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

- ముస్తాబైన రేగోడ్ ఆంజనేయ స్వామి ఆలయం



ఆలయంలో కొలువైన ఆంజనేయ స్వామి

రేగోడ్(మెదక్): కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా, భక్తుల కొంగు బంగారంగా చెప్పుకునే ఆంజనేయ స్వామి ఆలయ పునర్ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ముస్తాబు చేశారు. రేగోడ్ మండల కేంద్రంలో సుమారు 135 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆలయంలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం సూర్యచంద్రులు, శంకుచక్రం ఆకారాలతో వెలసి ఉండటం విశేషం. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం జీర్ణావస్థకు చేరడంతో గ్రామస్తులు, దాతల సాయంతో ఆలయాన్ని పునఃనిర్మించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు పూజలు, హోమాలు, తీర్థ ప్రసాదం , నిత్యాన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలకు మంత్రి దామోదర రాజనర్సింహ, మాధవానంద స్వామి, సంగ్రాం మహరాజ్, అంబికా శివయోగి స్వామిజీలు రానున్నారని నిర్వాహకులు తెలిపారు.

జోరుగా వరి కోతలు





చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గ్రామాల్లో యాసంగి వరి కోతలు జోరందుకున్నాయి. గ్రామాల్లో ముందుగా నాటు వేసిన వరి పంట కోతకు రావడంతో రైతులు కోత మిషన్ల సహాయంతో కోతలు మొదలు పెట్టారు. మండల పరిధిలోని మిర్జాపల్లి, కామారం, జంగరాయి, గవ్వలపల్లి గ్రామాల్లో ఇప్పటికే కోతలు మొదలయ్యాయి. రైతులు ధాన్యాన్ని కల్లాల వద్దకు చేర్చి ఆరబెడుతున్నారు. నార్సింగి మండలంలోనూ అన్నదాతలు వరి కోతలు కోసి, ధాన్యాన్ని కల్లాల వద్దకు చేరుస్తున్నారు.

వాహనదారులు జాగ్రత్త!

వరి కోతలు జోరందుకోవడంతో రైతన్నలు ధాన్యాన్ని రహదారులపై ఆర బెడుతున్నారు. చిన్నశంకరంపేట–నార్సింగి, గవ్వలపల్లి–ఖాజాపూర్, గవ్వలపల్లి–వెల్దుర్తి రహదారులపై దారి పొడవున ఆర బెడుతున్నారు. రాత్రి అయితే ధాన్యం ఒకచోటకు చేర్చి నల్లని టార్పలిన్లు కప్పుతున్నారు. ముఖ్యంగా వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు ధాన్యం కుప్పలను గమనించక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి పూట ప్రయాణించే వారు జాగ్రత్తగా వెళ్లాలి.

వల్లూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని ఐదు గ్రామాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి సహకారంతో రూ.30 లక్షల నిధులు మంజూరైనట్లు మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వల్లూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబు, మాజీ సర్పంచ్ అంబారీష, అబ్దుల్ వాహెబ్, సురేశ్, నర్సింహులు, శేఖర్, షరీఫ్, పాషా, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.